సరిగ్గా మధ్యకొచ్చేసరికి రోడ్డుమధ్యని విశ్రాంతి తీసుకుంటున్న వో జంతువును చూసి తప్పుకొని చెయ్యవలసివచ్చింది. తప్పుకొని మళ్ళీ జోరుగా నడవసాగింది.

అక్కడ, ఉమెన్స్ ఎంప్లాయ్‌మెంట్ స్కీమ్‌వారి స్టాల్ చాటున ఒక దృశ్యం వారిరువురి దృష్టినీ ఆకర్షించింది...ఎవరో వొక జంట...పక్కపక్కగా కూర్చున్నారు ... ఇద్దరిమధ్యా చీమ దూరే సందైనా లేదు. ఒకరి చుట్టూ వొకరు చేతులు వేసుకొని, ఒకరి చెంప ఒకరి కానించుకొని వున్నారు ... కార్లు వస్తూనే వున్నాయి. ఆగకుండా పోతూనే ఉన్నాయి...కార్లలో వెళ్ళే వాళ్ళకి మన సంగతే పట్టిందా అన్నట్టు వాళ్ళిద్దరూ ప్రపంచాన్ని మరిచి అలా కూర్చున్నట్టుంది.

వ్యాసమూర్తీ కరుణాదేవి ఒకరి కళ్ళలో కొకరు చూసు కున్నారు.

వ్యాసమూర్తి మాట్లాడుదామని నోరు తెరిచాడు కాని అతనికి మాట రాలేదు. నిస్సహాయంగా రెండోసారి ఆమెవేపు చూశాడు.

సీజన్లు, క్లైములు లెని మానవ ప్రేమను గురించి వొకటి రెండు వాక్యాలు; ప్రస్తుతం కనబడ్డ దృశ్యంమీద ఒక వ్యాఖ్య, కరుణాదేవి మస్తిష్కంలో నాట్యమాడాయి. ఆమె గొంతు సవరించు కుని అతనివెపు చూసింది...వెంటనే చూపు రోడ్డుమీదికి మళ్ళించు కొని, మాటలు గొంతులోనే ఉపసంహరించుకొంది. కాని ఆమె నోటి పక్కనుంచి నవ్వు మాత్రం రాలిపోయింది. మరుక్షణంలో ఆమె ముఖంపంట పెదవి నొక్కుకుంది.

• • •

బంజారా హిల్స్‌లో, కరుణావిల్లాలో గెస్ట్ రూమ్‌లో వ్యాసమూర్తి కూర్చున్నాడు. అతనికి నిద్ర పోదామని లేదు. నిద్ర

